సాక్షి
నిర్మల్
మంగళవారం, 30, సెప్టెంబర్, 2025



నెత్తిన బతుకమ్మ ఎత్తుకొని బయలుదేరిన యువతులు



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

అమ్మ సన్నిధిలో భక్తజనం



చదువుల తల్లి సరస్వతీ అమ్మవారిని అత్యంత ప్రీతిపాత్రమైన మూలనక్షత్ర శుభఘడియల్లో దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు సోమవారం అధికసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. ఈ సందర్భంగా సరస్వతీ అమ్మవారు మహాగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

- వివరాలు 8లో ▶

గరిష్టం/కనిష్టం
30.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.



శాస్త్రినగర్‌లో బతుకమ్మలతో మహిళలు



బతుకమ్మలతో మున్సిపల్ కమిషనర్, జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ సుభాష్

'సద్దుల' సందడి

నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా అధికారులు, పట్టణ ప్రాంత మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మల వద్ద పూజలు చేశారు. అధికారులు, పట్టణ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం స్థానిక ధర్మసాగర్ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

- నిర్మల్‌చైన్‌గేట్



బతుకమ్మ ఎత్తుకున్న యువతులు

న్యూస్‌రీల్

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ జానకీ షర్మిల



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం



సన్మానిస్తున్న వేదిక ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల సాహిత్యకిరీటీ రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందిన జిల్లాకు చెందిన తుమ్మల దేవరావు, పత్తి శివప్రసాద్, పోలీస్ భీమేష్‌లను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జిల్లాకు చెందిన కవులు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణంరాజు, సాహితీ వేత్తలు బొండడి పురుషోత్తమరావు, కుమ్మరి నాగారం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 7 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అబ్దుల్ రజాక్

నిర్మల్‌టౌన్: జిల్లాలోని మద్యం దుకాణాలకు సోమవారం ఏడు దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 47 మద్యం దుకాణాలకు ఈనెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 23న లాటరీ పద్ధతిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తామన్నారు. ప్రతీ దరఖాస్తుకు రూ.3 లక్షలు రుసుముగా నిర్ణయించామని, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా అందజేయవచ్చన్నారు. గౌడ కులస్తులకు 3, ఎస్సీలకు 5, ఎస్టీలకు 1 రిజర్వేషన్ కల్పించామన్నారు. డీడీలు, చలాన్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నిర్మల్ పేరున తీయాలని, దరఖాస్తు ఫారం జిల్లా కార్యాలయంలో లేదా హైదరాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేటి నుంచి బూసార్‌బీట్ బంద్

భైంసాటౌన్: వరుస సెలవుల నేపథ్యంలో పట్టణంలోని ఏఎంసీ యార్డులో నాలుగు రోజుల పాటు బూసార్ బీట్ నిలిపివేయనున్నట్లు ఏఎంసీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు నిలిపేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కమీషన్ ఏజెంట్లు గమనించి సహకరించాలని కోరారు. అక్టోబర్ 4 నుంచి యథావిధిగా కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు.

మోగిన స్థానిక నగారా

- రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ..
- మూడు విడుతల్లో సర్పంచ్ ఎన్నికలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం



నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లాలోని 18 మండలాల్లో 400 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సోమవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ క్షణం నుంచే ఎన్నికల నిబంధనలు అమలులోకి వస్తాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 157 ఎంపీటీసీ, 18 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 400 గ్రామ పంచాయతీలు, 3,368 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

షెడ్యూల్ విడుదల..

జిల్లాల్లోని 18 మండలాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పూర్తిస్థాయి షెడ్యూల్‌ను ప్రకటించింది. రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించింది. అక్టోబర్ 23, 27న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో మూడు విడతలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ తెలిపింది. పోలింగ్ రోజునే పంచాయతీ ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. తక్షణమే ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎన్నికల కమిషనర్ తెలిపారు.

మొదటి విడత జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీల మండలాలు

మండలం	ఎంపీటీసీల సంఖ్య	ఓటర్లు
ఖానాపూర్	8	23,658
పెంబి	5	10,886
కడెం	10	29,159
దస్తురాబాద్	5	12,894
మామడ	9	26,072
లక్ష్మణచాంద	9	24,577
నిర్మల్	7	22,751
సోన్	8	21,801
సారంగాపూర్	14	39,516

రెండవ విడత జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీల మండలాలు

మండలం	ఎంపీటీసీల సంఖ్య	ఓటర్లు
దిలావర్‌పూర్	6	18,744
నర్సాపూర్(జి)	7	20,238
లోకేశ్వరం	10	29,359
కుంటాల	7	19,055
భైంసా	11	33,970
కుభీర్	14	40,625
తానూర్	11	31,516
ముధోల్	10	28,754
బాసర	6	15,728

పంచాయతీ షెడ్యూల్ విడతల వారీగా..

ఫేజ్ 1 లో ఎన్నికలు జరిగే మండలాలు

మండలం	గ్రామాలు	వార్డులు	ఓటర్లు
దస్తురాబాద్	13	102	12,894
కడెం	29	242	29,159
ఖానాపూర్	25	192	23,657
పెంబి	24	152	10,886
మామడ	27	222	26,072
లక్ష్మణచాంద	18	162	24,577

ఫేజ్ 2 లో ఎన్నికలు జరిగే మండలాలు

మండలం	గ్రామాలు	వార్డులు	ఓటర్లు
నిర్మల్‌రూరల్	20	170	22,751
సారంగాపూర్	32	282	39,516
సోన్	14	132	21,801
దిలావర్‌పూర్	12	108	18,744
నర్సాపూర్(జి)	13	120	20,238
లోకేశ్వరం	25	224	29,359
కుంటాల	15	134	19,055

ఫేజ్ 3లో ఎన్నికలు జరిగే మండలాలు

మండలం	గ్రామాలు	వార్డులు	ఓటర్లు
భైంసా	30	258	33,970
ముధోల్	19	166	28,754
తానూర్	32	268	31,516
బాసర	10	90	15,728
కుభీర్	42	344	40,625

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ ఇలా..

కీలక ఘట్టాలు	తొలివిడత	రెండో విడత
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 9	అక్టోబర్ 13
చివరితేదీ	అక్టోబర్ 11	అక్టోబర్ 15
పరిశీలన	అక్టోబర్ 12	అక్టోబర్ 16
ఉపసంహరణ	అక్టోబర్ 15	అక్టోబర్ 19
ఎన్నికల తేదీలు	అక్టోబర్ 23	అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు	నవంబర్ 11	నవంబర్ 11

గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఇలా

కీలక ఘట్టాలు	తొలి విడత	రెండో విడత	మూడో విడత
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 17	అక్టోబర్ 21	అక్టోబర్ 25
చివరితేదీ	అక్టోబర్ 19	అక్టోబర్ 23	అక్టోబర్ 27
పరిశీలన	అక్టోబర్ 20	అక్టోబర్ 24	అక్టోబర్ 28
ఉపసంహరణ	అక్టోబర్ 23	అక్టోబర్ 27	అక్టోబర్ 31
ఎన్నికల తేదీలు	అక్టోబర్ 31	నవంబర్ 4	నవంబర్ 8



స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే పలు దశల్లో అధికారులందరికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ రెవెన్యూ, ఇతర అధికారుల సమన్వయంతో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోడ్ అమలులో ఉన్నందువల్ల సరైన పత్రాలు లేకుండా రూ.50 వేల నగదును వెంట తీసుకువెళ్లరాదన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీపీఆర్‌ఓ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలన్నారు. అనంతరం ఇటీవల నిర్మల్ జిల్లాకు జల్ సంచాయ్-జన భాగిదారి కార్యక్రమంలో అవార్డు లభించడంతో అధికారులను అభినందించారు. భవిష్యత్‌లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ మరిన్ని అవార్డులు సాధించి జిల్లా పేరును దేశవ్యాప్తంగా నిలపాలన్నారు.

ప్రజావాణి తాత్కాలిక వాయిదా..

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అధికారులంతా ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎలక్షన్ కోడ్ జిల్లాలో పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవి నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

నిర్మల్‌చైన్‌గేట్: దుర్గాదేవి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేసే వినాయక సాగర్ చెరువు (బంగల్పేట్ చెరువు)ను ఆమె పరిశీలించారు. ప్రజలు చెరువులోకి దిగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంతకుముందు బంగల్‌పేట్ మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌కు అమ్మవారి ఫొటోను బహూకరించారు. పూజారులు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని అన్నారు. సోమవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అనుసరిస్తూ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లను తొలగించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జిల్లాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలన్నారు. పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

'ఎస్సీ జనరల్ నుంచి బీసీకి మార్చాలి'

నిర్మల్‌చైన్‌గేట్: దస్తురాబాద్ మండలం పెర్కపల్లి గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీ జనరల్ నుంచి బీసీకి మార్చాలని కోరుతూ ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెర్కపల్లి గ్రామం 2019లో ఉమ్మడి దస్తురాబాద్ నుంచి విడిపోయి పూర్తిస్థాయి బీసీ గ్రామ పంచాయతీగా ఎర్పడిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీకి కేటాయించారన్నారు. కానీ 2011 జనాభా లెక్కల ప్రకారం పూర్తిస్థాయి బీసీ జనాభా ఉన్నప్పటికీ అధికారుల తప్పిదం కారణంగా ఎస్సీ జనాభా ఉన్నట్లు చూపించారన్నారు. దీంతో గ్రామంలో నివసించే బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. 1, 2 వార్డులను కూడా ఎస్సీ రిజర్వేషన్ నుంచి బీసీకి మార్చాలన్నారు.

రైతుల కష్టం వరదపాలు

- అధిక వర్షాలకు మొలకెత్తిన మొక్కజొన్నలు
- ఆరబెట్టేందుకు నానా తిప్పలు
- సోయా, పత్తి పంటలదీ అదే పరిస్థితి
- పంటల దిగుబడిపై సన్నగిల్లుతున్న ఆశలు



ఈచిత్రంలో కనిపిస్తున్న రైతు లోకేశ్వరం మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన భోజన్న. ఈ ఏడాది తనకున్న రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఇటీవలే పంట కోత దశకు వచ్చింది. కంకులను కోసి రోడ్డుపై ఆరబెట్టాడు. ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న కంకులకు మొలకలు వచ్చాయి. దీంతో పంట దిగుబడి రావడం గగనంగా మారిందని రైతు ఆవేదన చెందుతున్నాడు. ఈ ఒక్క రైతుదే కాదు జిల్లాలోని చాలామంది అన్నదాతలదీ ఇదే పరిస్థితి.

లోకేశ్వరం: అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ఇంటికి వచ్చేంత వరకు నమ్మకం లేకుండా పోతోంది. విత్తనం విత్తింది మొదలు ప్రకృతి పగబట్టినట్లు వెంటాడుతూనే ఉంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు జిల్లాలో సాగు చేసిన పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. మొదట్లో ఆశించిన మేర వర్షాలు కురియకపోవడంతో పంటల్లో ఎదుగుదల లోపించింది. తీరా పంట దిగుబడి చేతికి వచ్చే సమయంలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట చేలలోనే సోయా, పత్తి కాయలకు మొలకలు వస్తున్నాయి. కోతకు వచ్చిన మొక్కజొన్న కంకులు తడిసిపోవడంతో మొలకలు వస్తున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రధానరోడ్లపై ఆరబోసిన కంకులు సైతం ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు తడారక మొలకలు వస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అంతర పంటగా మొక్కజొన్న ..

పసుపులో అంతర పంటగా మొక్కజొన్న సాగు చేస్తారు. వర్షాలకు పంటచేలలో నీరు నిలవడంతో తేమ ఆరిపోయేంత వరకు మొక్కజొన్నను కోయలేని పరిస్థితి. ఇదే జరిగితే మొక్కజొన్న పసుపు పై పడిపోయి పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. కోసిన కంకులను కుప్పగా పోస్తే వర్షానికి నాని మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా..

మొక్కజొన్న పంటకు మార్కెట్‌లో మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2400లు ఉండగా ఓపెన్ మార్కెట్‌లో రూ.2,800 నుంచి రూ.3000ల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాదిలో తొలిదశ కత్తెర పురుగు, గింజదశలో కోతులు, రామచిలుకలు, అడవి పందులు దెబ్బతీశాయి. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 15 నుంచి 20 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో సాగు వివరాలు

పంట	ఎకరాల్లో
మొక్కజొన్న	15,371
వరి	1.40 లక్షలు
పత్తి	1.57 లక్షలు
సోయా	40,000



పంచగుడిలో మొలకెత్తిన మొక్కజొన్న కంకులు

మస్తు ఆశలుండే



ఈసారి మొదటి నుంచి వర్షాలు విస్తారంగా కురియడంతో మొక్కజొన్న సాగుచేయాలని నిర్ణయించుకున్నా. కానీ ఆశించిన మేర పంట దిగుబడి వచ్చేలా కనిపించడంలేదు. మొక్కజొన్న కంకులకు ఎక్కడ చూసినా మొలకలే కనిపిస్తున్నాయి.

– రాథోడ్ బలిరాం, నగర్‌తండా

దిగుబడి కష్టమే



అధిక వర్షాలు కురవడం వల్ల ఈ సారి సాగు చేసిన పంటలు చేతికి రావడం కష్టమే. పెట్టుబడులు సైతం మునగాల్సిన పరిస్థితి కనిపిస్తుంది. ప్రతీ కర్రకు మొలకలే కనిపిస్తున్నయ్. సోయా, పత్తి పంటలకు కూడా మొలకలు వస్తున్నయ్.

– ప్రవీణ్, రాయాపూర్‌కాండ్లీ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మొక్కజొన్న పంట ఇప్పుడిప్పుడే చేతికి అందివస్తోంది. రైతులు చేలల్లో పంట ఆరబెట్టుకునేందుకు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేసుకోవాలి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులచేత సర్వే చేయించాం. ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

పూలే స్ఫూర్తితో కులనిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కే.రాజన్న

నిర్మల్‌చైన్‌గేట్: జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేద్దామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నందిరామయ్య పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన్‌లో కుల నిర్మూలన జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే 1873 సెప్టెంబర్ 24న సత్యశోధకు సమాజ్ అనే సంస్థను ఏర్పాటు చేసి దేశంలో అంటరానితనం, కుల నిర్మూలన జరగాలని పోరాడారన్నారు. జిల్లా కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ కులాలు, మతాలను ప్రోత్సహించి అధికారాన్ని కాపాడుకుంటున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించలేక పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు ఎం.బక్కన్న, ఆర్.రామలక్ష్మణ్, ఎస్.గంగన్న, గఫూర్, గంగామణి, ఎస్.లక్ష్మి, దేవక్క, భీమవ్వ, ఫెరోజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి


మణిదీప్‌ను అభినందిస్తున్న బాబురావు

కాసిపేట: మండలంలోని సోమగూడెంకు చెందిన పి.మణిదీప్ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు డీఐఈవో అంజయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబురావు తెలిపారు. ఈ నెల 25, 26, 27వ తేదీల్లో జనగాంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. మందమర్రి మోడల్ స్కూల్ సెకండియర్ విద్యార్థి మణిదీప్ అక్టోబర్ 2నుంచి 12వరకు శ్రీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని డీఐఈవో, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ, ఒలింపిక్ అసోసియేషన్ ఫుట్‌బాల్ సెక్రెటరీ పిన్నింటి రఘునాథరెడ్డి, కోచ్ బాదే శేఖర్ అభినందించారు.

'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ'కు ఎంపికైన ఆరాధ్య



అవార్డు స్వీకరిస్తున్న ఆరాధ్య

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ఆరాధ్య స్టార్ కిడ్ విభాగంలో ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారానికి ఎంపికైంది. హైదరాబాద్‌కు చెందిన రౌండ్ టేబుల్ సంస్థ చేపట్టిన ఎంపిక పోటీల్లో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అల్లాడి సురేష్–శాంతి దంపతుల కుమార్తె ఆరాధ్య లక్ష్మి అవార్డుకు ఎంపికైంది. పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా బాలలు పాల్గొనగా తుది పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారు. వారిలో రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా చిన్నారి ఆరాధ్యలక్ష్మి ఎంపికైంది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంది.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం


దివ్యను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని శ్రీశ్రీ నగర్‌కు చెందిన రాసపల్లి దివ్య ఇటీవల సింగరేణి కోల్‌మైన్స్ ఆధ్వర్యంలో భూపాలపల్లి నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. మంచిర్యాల డివిజన్ శ్రీరాంపూర్ ఏరియాలో జీఎం ఆఫీస్ పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న దివ్య 58 కిలోల విభాగంలో 250 కిలోల బరువు ఎత్తి పతకం అందుకుంది. డిసెంబర్‌లో నాగ్‌పూర్‌లో జరిగే కోలిండియా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననుంది. దివ్యను తాజా మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, బీ స్ట్రాంగ్ జిమ్ నిర్వాహకులు గోదారి శ్రీనాథ్, జిమ్ సభ్యులు రవి, లక్ష్మీప్రసాద్ సన్మానించారు.

అమ్మ సన్నిధిలో భక్తజనం

- బాసర ఆలయంలో మూలానక్షత్ర పూజలు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు
- గోదావరి వద్ద భారీ భద్రత ఏర్పాట్లు


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆలయ పూజారి


దర్శనానికి బారులు తీరిన భక్తులు

భైంసా/బాసర: బాసరలోని చదువుల తల్లి సరస్వతీని అత్యంత ప్రీతిపాత్రమైన మూలానక్షత్ర శుభఘడియల్లో దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు సోమవారం వేలసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వేకువజాము నుంచే బారులు తీరారు. దివ్యమూహూర్తాన తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది.

ప్రత్యేక అలంకరణ...

మూలానక్షత్రం పూజల కోసం బాసర ఆలయాన్ని ప్రత్యేకంగా పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణం పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక అలంకరణల మధ్య అమ్మవారిని స్మరిస్తూ భక్తులు దర్శనం చేసుకున్నారు. ప్రసాదల కౌంటర్ వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో కనిపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు కొంతమేర ఇక్కట్లకు గురయ్యారు. వ్యాసగుహ, మహంకాళి ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది. ఆలయంలో మధుకర దీక్షలు స్వీకరించిన మాలధారులంతా స్వచ్ఛందంగా సేవలు అందించారు.

ఉప్పొంగిన గోదావరి

సోమవారం సైతం బాసర వద్ద గోదావరి నది ఉప్పొంగి ప్రవహించింది. గంగమ్మ తల్లి సూర్యేశ్వర ఆలయాన్ని తాకుతూ వరద నీరు ప్రవహించింది. నెల రోజులుగా బాసర వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. మూల నక్షత్రం రోజున పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు రక్షణగా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. ఆలయ అధికారులు, పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ భక్తులను కట్టడి చేశారు.

ఆదాయం రూ.25,65,100

బాసర: బాసర సరస్వతీ ఆలయానికి సోమవారం భారీగా ఆదాయం సమకూరింది. భక్తుల మొక్కులు, చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు ద్వారా ఆదాయం వచ్చింది. రూ.వెయ్యి అక్షరాభ్యాస పూజలు 1,065 జరిపించగా.. రూ.16,05,000, రూ.150 అక్షరాభ్యాసాలు 526 ద్వారా రూ.78,900, రూ.100 మండప ప్రవేశం 1930 ద్వారా రూ.1,93,000, రూ.50 మండప ప్రవేశం 310 ద్వారా రూ.15,500, రూ.100 అభిషేకం లడ్డు ప్రసాదం 2565 ద్వారా రూ.2,56,500, లడ్డు పులిహోర ప్రసాదాలతో రూ.4,16,200 సమకూరింది. మొత్తంగా రూ.25,65,100 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న బాలుడు

మహాగౌరి అవతారంలో...


మహాగౌరీ అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సోమవారం సరస్వతీ అమ్మవారు మహాగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా మూడు గంటల పాటు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మహా మంగళహారతి ఇచ్చారు.

పలువురి దర్శనం...

సరస్వతీ అమ్మవారిని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ అభిలాష అభినవ్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌తో పాటు పలువురు దర్శించుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలనక్షత్రం కలిసిరావడంతో సుదూర ప్రాంతాల భక్తులు ఒకరోజు ముందుగానే వచ్చారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు


గోదావరి పుష్కర్ ఘాట్‌పై ఉన్న శివాలయం వద్దకు చేరిన ప్రవాహం

ఉప్పొంగిన గోదావరి

నిర్మల్ జిల్లాలోని బాసరలో గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. సోమవారం వ్యాసమహర్షి ఆలయం, రెండో ఆర్చీ గేటు, వంద గదుల భవనం వరకు వరద నీరు వచ్చి చేరింది. ఆలయం వద్ద ఉన్న దుకాణాలు, ప్రైవేటు లాడ్జీలు, సత్రాలు, పుష్కరఘాట్లు నీట మునిగాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


గంగామాత విగ్రహాన్ని తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి


పూర్తిగా నీటిలో మునిగిన హారతి ఇచ్చే ఘాట్

అలరించిన సాహితీ సమార్చన


సన్మానం పొందిన కవులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని గ్రంథాలయ వీధిలో నిర్వహించిన సాహితీ సమార్చన అందరినీ అలరించింది. శతావధాని మారేపల్లి పట్వర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సమార్చనకు జిల్లా నుంచి వందలాది మంది కవులు తరలివచ్చి కవితలను వినిపించారు. అనంతరం కవులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కవులు జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, కొమ్మెర రాంమూర్తి, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లు, బొడ్డు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మాంసంపై మీమాంస

- పండుగ రోజు దుకాణాలు బంద్
- మందుబాబుల్లో ఆందోళన

నిర్మల్‌ఖిల్లా: దసరా పర్వదినం అంటేనే అందరికీ సంబరం. పండుగ రోజున పిండివంటలతోపాటు మాంసం, మందు వంటివి స్వీకరిస్తారు. యువకులు పండుగ రోజునే విందు కోసం ప్రణాళికలు వేసుకుంటారు. ఈసారి పండుగ అక్టోబర్ 2న వస్తోంది. మందు, మాంసం నిషేధం ఉన్న గాంధీ జయంతి రోజున పండుగ నిర్వహణ ఎలా..! అన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. సాధారణంగా జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంసం దుకాణాలు మూసివేస్తారు. మరోవైపు పండుగ రోజున మాంసాహారులైన ప్రతీ ఇంట్లో ముక్క ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై సందిగ్ధత నెలకొంటోంది. నిర్మల్ జిల్లాలో 47 వైన్స్‌లతోపాటు పదుల సంఖ్యలో బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. 400 పైగా మాంసం విక్రయ దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దసరా పర్వదినం గాంధీ జయంతి రోజున వస్తుండడంతో మద్యం, మాంసం దుకాణాలు మూతపడనున్నాయి.

కాంట్రాక్ట్ కార్మికులకు అందని బోనస్

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ డబ్బులు అందలేదు. శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికులకు ఈ నెల 29న లాభాల బోనస్ చెల్లించనున్నట్లు యాజమాన్యం ఇటీవల ప్రకటించింది. పర్మినెంట్ కార్మికులకు నికర లాభాల్లో 34 శాతం వాటా, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5500 బోనస్‌గా చెల్లిస్తామని పేర్కొంది. పర్మినెంట్ కార్మికుల ఖాతాలో సోమవారం డబ్బులు జమ కాగా, కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించలేదు. శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 2800 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో 300 మందికి లాభాల బోనస్ చెల్లించేలా సాయంత్రానికి అధికారులు ఫైనాన్స్ క్లియర్స్ చేశారు. వీరికి ముందుగా చెల్లిస్తారు. మిగతా వారికి మరో రెండ్రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిసింది. కాగా, కాంట్రాక్టర్లు కాంట్రాక్ట్ కార్మికుల జాబితాను కంపెనీ అధికారులకు సమర్పించిన తర్వాత అందుకు అనుగుణంగా డబ్బులను కాంట్రాక్టర్లకు కంపెనీ చెల్లిస్తుంది. కాంట్రాక్టర్లు తిరిగి ఈ డబ్బులను కార్మికులకు చెల్లిస్తారు. కాంట్రాక్టర్ల ఖాతాలో డబ్బులు జమ కావడం వల్ల తమకు ఐటీ పడుతుందని, జీఎస్టీ ఇబ్బందులు వస్తాయంటూ రెండ్రోజులుగా అధికారుల వద్ద అభ్యంతరం వ్యక్తం చేయడం, దీనిపై అధికారులు చర్చించడం జరుగుతోంది. దీనివల్ల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఇదిలా ఉంటే శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ పనులు చేసే సీఆర్ఆర్ సంస్థ కాంట్రాక్ట్ కార్మికులు గత మూడు నెలలుగా వేతనాల కోసం సమ్మె చేస్తున్నారు. కాంట్రాక్టర్ కూడా పనులు పూర్తిగా బంద్ చేశారు. వారు జీతాలు లేక కనీసం పండుగ పూట బోనస్ వస్తుందనుకుంటే కాంట్రాక్టర్ వైఖరితో ఇవి కూడా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరాంపూర్‌లో రెండ్రోజుల్లో కాంట్రాక్ట్ కార్మికులందరికీ బోనస్ డబ్బులు చెల్లిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

నిజామాబాద్‌లీగల్: హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ నిజామాబాద్ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి సాయి సుధా తీర్పునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా భక్తపూర్‌కు చెందిన షకీల్ తాగుడుకు బానిసై నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో సంచరించేవాడు. 18 అక్టోబర్ 2021న నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఎస్‌ఎల్‌ఎస్ వైన్స్ వద్ద మద్యం తాగి గొడవ చేస్తుండగా, షేక్ జలీల్ అనే వ్యక్తి గొడవ చేయొద్దంటూ షకీల్‌ను బెదిరించాడు. తర్వాతి రోజు కత్తితో వైన్స్ వద్దకు వచ్చిన షకీల్ జలీల్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వైన్స్‌లో పనిచేసే రమేశ్, సర్ఫరోజ్ ఖాన్ జలీల్‌ను నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి షకీల్‌ను జైలుకు పంపారు. పోలీసుల తరఫున డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మినర్సయ్య వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరు అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరిని సోమవారం మావల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి కథనం ప్రకారం.. మావల గ్రామానికి చెందిన ఏరా నడిపి గంగన్న, ఏరా లక్ష్మీలు ఆరేళ్ల కిందట వారి లావాణి భూములను అదే గ్రామానికి చెందిన ఉష్కం రఘుపతి దగ్గర తాకట్టు పెట్టి ఒక్కొక్కరూ రూ.18 లక్షలు అప్పుగా తీసుకున్నారు. తీసుకున్న అప్పు డబ్బులు ప్రస్తుతం చెల్లిస్తామని భూమిని తిరిగి అప్పగించాలని కోరగా భూమిని ఇవ్వకుండా రఘుపతి కులం పేరుతో దూషించారని బాధితులు పోలీసులకు జూన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు రఘుపతిని సోమవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి మత విద్వేషాలు రెచ్చగొడుతూ పోలీసుల పాత వీడియోలను సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఆ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా వాట్సాప్ గ్రూపుల్లో విద్వేశాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవని, గ్రూప్ అడ్మిన్లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పవర్ ప్లాంటులో ప్రమాదం

- గేటు మీదపడి సీఐఎస్ఎఫ్ ఏఎస్సై మృతి
- మూసివేస్తుండగా ప్రమాదవశాత్తు ఊడిన ఫైనం


అర్జున సారథి(ఫైల్)

జైపూర్: పండుగపూట పవర్ ప్లాంటులో విషాదం నెలకొంది. రాత్రి విధులకు హాజరైన సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ గార్డుకు అదే చివరి డ్యూటీ అయింది. ఊహించని విధంగా గేటురూపంలో మృత్యువు కబళించింది. గేటు మూసి వేస్తున్న క్రమంలో ఊడిపోయి మీద పడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కొచ్చెర్లకు చెందిన నరహరిశెట్టి అర్జున సారథి(56) జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)లో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ విభాగంలో ఏఎస్సైగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం రాత్రి డ్యూటీకి వచ్చిన ఆయన ఎస్టీపీపీ అడ్మిన్ భవనం ప్రధాన గేటు వద్ద రాత్రి విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో వీల్స్ గేటు మూసి వేస్తున్న క్రమంలో ఊడిపోయి ప్రమాదవశాత్తు అతడిపై పడింది. కిందనలిగిపోయిన అర్జున సారథిని తోటి సిబ్బంది గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ డీఐజీ, ఐపీఎస్ డాక్టర్ ఎంజీ.రాఘవేంద్రకుమార్, ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంఛల్‌సర్కార్ పరిశీలించారు. మృతుడికి భార్య గంగాభవాని, కుమారుడు రాజసింహాదత్తు, కూతురు తేజసాయిశ్రీ ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తున్న చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి


సతీష్(ఫైల్)

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఆటో డ్రైవర్ అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్ షిర్కే కాలనీకి చెందిన పూదరి సతీష్(40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య నుంచి విడాకులు కావడంతో ఒంటరిగా ఉంటున్నాడు. సతీష్ ఇంటి పొరుగువారైన పన్యాల బంగారితో పార్కింగ్ విషయంలో గత నాలుగు నెలల క్రితం వివాదాలు తలెత్తాయి. ఈ నెల 28న సాయంత్రం మరోసారి పార్కింగ్ విషయంలో గొడవ జరిగింది. బంగారి భార్య లక్ష్మి, చిన్న కూతురు సతీష్ ఇంట్లోకి చొరబడి అతడిని కొట్టారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి సతీష్‌ను సుత్తితో కడుపులో కొట్టాడు. సోమవారం సతీష్ అక్క పోగుల స్వప్న ఇంటికి వెళ్లి చూసే సరికి గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి అక్క పోగుల స్వప్న ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాల మధ్య కుదిరిన రాజీ

బెల్లంపల్లి: హిందు ఉత్సవ సమితి, దళిత సంఘాల మధ్య ఏర్పడిన వైరుధ్యానికి తెర పడింది. దసరా వేడుకల్లో భాగంగా బెల్లంపల్లిలో రావణాసుర వధ కార్యక్రమం నిర్వహిస్తే అడ్డుకుంటామని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ తన క్యాంపు కార్యాలయంలో ఇరువర్గాలను ఆహ్వానించి శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న ఎమ్మెల్యే శాంతియుతంగా ఎవరి మనోభావాలకు భంగం కలగకుండా ఏటా ఆనవాయితీగా జరుగుతున్న రావణాసుర వధ కార్యక్రమాన్ని ఈసారి హిందు ఉత్సవ సమితి నిర్వాహకులు నిర్వహిస్తారని ఇందుకు సహకరించాలని సూచించారు. దీంతో వివాదం సమసిపోయినట్లు దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, మనోహర్, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కుంబాల రాజేష్, చిలుక రాజనర్సు, గోమాస రాజం, శేఖర్, హిందు ఉత్సవ సమితి సభ్యులు నగేష్, బాల సంతోష్ పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

ముధోల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన కొట్ల విఠల్ (65) ఓ దుకాణం నిర్వహిస్తుండగా అందులో నష్టం రావడంతో ఐదెకరాల భూమిని అమ్మేశాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు గజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పింప్లె మంగళ భర్త వేధింపులు తాళలేక అఘాయిత్యానికి పాల్పడింది. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం హైదరాబాద్‌కు రిఫర్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

బోథ్: గంజాయి సాగు, సరఫరా చేస్తున్న వ్యక్తిని బోథ్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బోథ్ మండలం డెమ్మి గ్రామానికి చెందిన సాంబ్లే ఈశ్వర్‌సింగ్ గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. 500 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్, మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

గంజాయి నిందితులకు జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి వ్యాపారం చేసే నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ పి.శివరాంప్రసాద్ సోమవారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం.. 2001 డిసెంబర్ 20న ఉట్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారావు అనుమానాస్పదంగా కనిపించిన ఇచ్చోడ మండలం గాంధీనగర్‌కు చెందిన గుట్టేబాబు, గోదావరిఖనికి చెందిన నడిగొట్టు అరుణ్‌కుమార్‌లను తనిఖీ చేయగా 1100 గ్రాముల గంజాయి లభించింది. వీరిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి 10 మంది సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ సంజయ్‌కుమార్ వైరాగ్రే నేరాన్ని రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

బజార్‌హత్నూర్: మండలంలోని భూతాయి (బి) గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై సంజయ్ కుమార్ సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం భూతాయి(బి) గ్రామానికి చెందిన ముర్కుటే మారుతి, ముర్కుటే యోగేష్‌లు గుడుంబా తయారు చేస్తున్న స్థావరంపై దాడులు నిర్వహించి 12 లీటర్ల గుడుంబా, 50 కేజీల ఇప్పపువ్వును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముధోల్‌లో పట్టపగలే చోరీ

ముధోల్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ కాలనీలో నివాసం ఉంటున్న గంగసాగర అనే మహిళ ఇంట్లో సోమవారం పట్టపగలే చోరీ జరిగినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. సదరు మహిళ షాపింగ్ కోసం నిజామాబాద్‌కు వెళ్లింది. ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. రూ.5 లక్షల నగదుతోపాటు 5తులాల బంగారం, 15తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.